

# 65 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో బీసీల స్థితి - అభివృద్ధి దశ - దిశ విశ్లేషణ

## బిసి స్పెషల్ ప్లాన్ ప్రతిపాదనపై ప్రత్యేక చర్చ

## బిసి మేధావుల - రాజకీయ పార్టీల ప్రతినిధుల సమిష్ఠి రౌండ్‌టేబుల్ సమావేశం

**తేది : 28-08-2011, ఆదివారం ఉ॥ 10-00 గంటలకు, జూబ్లిహాల్, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్.**

ఈ మధ్యనే భారతదేశం తన అరవై ఐదవ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంది. ఈ సందర్భంగా మనగురించి, మన అభివృద్ధి గురించి విశ్లేషించుకునే ప్రయత్నం చేద్దాం. గత 65 సంవత్సరాలలో వచ్చిన మార్పులు, జరిగిన అభివృద్ధి దేశంలోని 52శాతం పైగా ఉన్న బీసీలపై ఎలాంటి ప్రభావం చూపింది? స్వాతంత్ర ఫలితాలు, ప్రజాస్వామ్య ఫలాలు ఎవరికందాయి? రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులు ఎవరు అనుభవించ గలుగుతున్నారు ? ఇంతవరకు జరిగిన మొత్తం అభివృద్ధిలో అసలు లబ్దిదారులెవరు? అందులో బీసీల వాటా ఎంత? అన్న అనేక విషయాలు నిర్మోహమాటంగా చర్చించాల్సిన అవసరం ఎంతో ఉంది. అందుకే ఈ సమావేశం.

రాజకీయ పార్టీలు, రాజకీయరంగం, ప్రభుత్వం అందులో ముఖ్యంగా రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంట్ - మంత్రిమండళ్లు - ఏ కులాల ఆదిపత్యంలో ఉన్నాయి పరిశీలించాలి ? పాలనా రంగం, న్యాయవ్యవస్థ, మీడియారంగం, ప్రభుత్వరంగ సంస్థల, యాజమాన్యాలు, పెట్టుబడులు, బడ్జెట్లు, పరిశ్రమలు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్, షేర్‌మార్కెట్, వర్తక-వాణిజ్యం, వ్యాపారం, ఎగుమతులు, దిగుమతులు, కార్పోరేషన్లు, మార్కెట్లు, నిర్మాణరంగం, రియల్ ఎస్టేట్లు, కాంట్రాక్టులు, లోన్లు, సబ్సిడీలు ఇలా మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఆదిపత్యం ఎవరెవరికుంది? దాని ద్వారా జరిగిన అభివృద్ధికి లబ్దిదారులెవరు? అలాగే విద్యాసంస్థలు, విజ్ఞాన సాంకేతిక రంగం, ఐటి, కార్పోరేట్ సంస్థలు, ఆసుపత్రులు, టూరిజం, రిసార్టులు, క్లబ్బులు, హోటళ్లు, సినిమారంగం ఇతర ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఇలా అనేక రంగాలు, సదుపాయాలపై ఎవరి అధికారమెంత? అదేవిధంగా సామాజిక జీవితాన్ని ప్రభావితంచేసే గుళ్ళు, గోపురాలు, మత సంస్థలపై ఆదిపత్యం ఏఏ కులాలకుంది. ఇలా అనేక రంగాల్లో సదుపాయాల్లో, సంస్థల్లో బీసీల వాటా ఎంత? అధికారమెంత? లభించిన ఫలాలశాతం ఎంత? మనం విశ్లేషించుకోవాలి.

ఈ దేశంలో వనరుల పంపకం లేదా పునఃపంపకం ఎలా జరిగింది. ఎవరి వాటా ఎంతెంత? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎవరి ఆస్తులు ఎంతెంత, ఎలా పెరిగాయి? ఎవరు ఎంతెంత కోల్పోయారు? ఎలా? వీటన్నిటి లెక్కలు తీయాల్సిన అవసరముంది? ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలు, అభివృద్ధి పథకాలు, బడ్జెట్ కేటాయింపులు వాటి అమలుకు ఇంతవరకు వెచ్చించిన అనేక లక్షల కోట్ల రూపాయల వల్ల జరిగిన అభివృద్ధిలో బీసీలవాటా ఎంత? అసలు ఈ అభివృద్ధి వ్యూహాలు అల్లేదెవరు? విధానాలలో మార్పులు ఎందుకు, ఎవరు, ఏ ప్రయోజనం కొరకు తెస్తారు? అందులో బీసీల ప్రమేయమెంత? అసలు అన్ని అధికారిక స్థాయిల్లో, రంగాల్లో, జరిగే నిర్ణయాకరణ ప్రక్రియల్లో బీసీల భాగస్వామ్యమెంత? అధికారమెంత? అర్థంచేసుకోవాల్సిన అవసరముంది. వివిధ ప్రభుత్వ అంగాలు, ఏజెన్సీలు, ప్రభుత్వ ఆధారిత సంస్థల్లో ఎన్నికవుతున్న ప్రతినిధులెవరు? ఎన్నికైన పదవులేకాకుండా దేశవ్యాప్తంగా అభివృద్ధిని ప్రభావితంచేసే లేదా ప్రభుత్వ సహాయాన్ని లేదా సౌకర్యాలను ఆశ్రితులకు / తమవారికి విచక్షణ పూర్వకంగా అందజేసే అధికారం కల్గిన అనేక సంస్థల్లో లక్షలాది నామినేటెడ్ పదవుల పంపిణీ ఏ కులాల చేతుల్లో వుంది? ఏ కులాలకు చెందుతుంది? కొన్ని కులాల చేతుల్లో అది కేంద్రీకృతం కావడంవల్ల వారు తీసుకునే నిర్ణయాలు ఆయా కులాలకనుకూలంగానే ఎందుకుంటున్నాయి?

బీసీల్లో అనేక ఉత్పత్తి కులాలు, సేవాకులాలు, వినోదాన్నందించే వృత్తి కలిగిన అనేక కులాలు, ఇంకా సంచార కులాలతోపాటు దాదాపు 20 కులాలకుపైగా ఇంకా యాచక వృత్తుల్లోనే ఉండటం దయనీయం. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వాళ్లకు అందుబాటులో లేకపోవడం శోచనీయమైన విషయం. వాస్తవానికి భారతదేశంలో జనాభా విషయంలో, ఓటర్ల శాతంలో అత్యధికశాతం బీసీలే. ప్రభుత్వానికి అత్యధికశాతం పన్నుల రూపంలో ఇతరత్ర ఆదాయన్నందించేది బీసీలే? ఎక్కువమంది వినియోగదారులు బీసీలే? అత్యధికశాతం మానవ వనరుగా, ఎక్కువశాతం నిపుణ కార్మికులుగా, ఉత్పత్తిలో అత్యధికశాతం దేశ సంపద నిర్మించిన వారిలో అత్యధికశాతం బీసీలే? అయితే ఇంకోవైపు దారిద్రరేఖ దిగువన పడిపోయిన వారిలోకూడా అత్యధికశాతం బీసీలే? భూమి, నీరు, ఇతర ఉత్పత్తి వనరులపై స్వాతంత్రం వచ్చాక ఆదిపత్యం కొల్పోయిన వారిలో ఎక్కువశాతం బీసీలే? వృత్తులు ధ్వంసమై, వనరులు కొల్పోయి, విద్యకు, ఆరోగ్యానికి నోచుకోక, గ్రామాలు, కుటుంబాలు వదిలి పొట్టచేతపట్టుకొని వలసవెళ్ళే వారిలో కూడా అత్యధికశాతం బీసీలే? ఉపాధి కొల్పోతూ, అప్పులతో ఆకలి

చావులు, ఆత్మహత్యలు చేసుకున్నవారిలో కూడా బిసీలే అత్యధికులు. 65 సంవత్సరాల తర్వాత కూడా ఈ పరిస్థితి ఇలా ఎందుకుంది? రాజ్యాంగంలోని ప్రవేశిక, ఆదేశసూత్రాలు, ప్రాథమిక హక్కులు, ఇంకా 9వ షెడ్యూల్, ఇతర ప్రకరణాలలోని అనేక హామీలు, రాజకీయ పార్టీల నిరంతర ఎన్నికల వాగ్దానాలు, మానిఫెస్టోలు 65 సంవత్సరాలుగా ఉంటున్నప్పటికీ కూడా ఈ పరిస్థితి ఇలాగా ఎందుకు కొనసాగుతుంది? విస్తృతంగా చర్చించాల్సి ఉంది.

మూడువేల సంవత్సరాల నుండి భారత సమాజాన్ని పట్టిపీడిస్తూ, మనుష్యులను విడదీసి, గిరిగీసి పాలిస్తున్న ఈ కుల వ్యవస్థవల్ల వాస్తవానికి లాభపడిందెవరు? నష్టపోయిందెవరు? స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఈ వ్యవస్థను కొనసాగించేదెవరు? కులం నిర్మూలించబడితే లాభపడేదెవరు? నిర్మూలించబడాలని కోరుకునేదెవరు? తరతరాలుగా ఈ కులవ్యవస్థవల్ల అగ్రకులాలే ప్రయోజనం పొందారన్నది చారిత్రక సత్యం? దానివల్ల లభించిన అధికారాన్ని వినియోగించుకొని, దీన్ని కొనసాగిస్తూ, తమ అధికారాన్ని విస్తృతపర్చుకుంటూ అన్ని రంగాలకు వ్యాపించి దోపిడీని యదేచ్ఛగా కొనసాగించాలని కోరుకున్నదీ వారె? అందుకే కులం కొందరిని అందలమెక్కించింది? మెజారిటీ ప్రజలను అదః పాతాళానికి తొసేసింది. కొందరికి అధికారమిచ్చి, కొందరికి పెట్టుబడిగా మారితే, ఎంతోమందికది గుండె బరువుగా మారి అనేక మందికది అవమాన్నిచ్చింది. అణచివేతకు గురిచేసింది? అర్థబానిసలుగా మార్చింది? కొందరికే గౌరవాన్నిచ్చి అనేక మందికి అవమానాన్నిచ్చింది? ఈ పరిస్థితి యదాతదంగా ఇలాగే కొనసాగాలని కోరుకునేదెవరు? వాస్తవంలో జరుగుతున్నదేమిటి? కులం వెనకబాటుతనమని సకల జనుల సామరస్య సాధనతో అభివృద్ధి సాధించాలనే 'కులాతీతదృక్పథంతో' చేసే 'ప్రతిపాదన' కింది కులాలను మరింత అణచివేతకు గురిచేసి అంతిమంగా అగ్రకులాల ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. 'అందరూ' అనే భావనలో అన్నింటా అగ్రకులాల ప్రయోజనాలే నిఘూఢంగా ఉన్నట్లు గమనించవచ్చు. 'సమానత్వం' అట్టడుగుస్థాయినుండి పై వరకు 'అందరూ' అన్న విలువలతో కూడుకున్నట్లయితే 'సార్వజనీనత' సాధ్యం. అన్ని రంగాల్లో అన్ని స్థాయిల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని ప్రయోజనాలు అందరికి చేరాలనే 'ఆకాంక్ష' నిజమైన ప్రజాస్వామ్య విలువ. ఇది ప్రస్తుతం అంతటా మృగ్యం.

స్వాతంత్రం వచ్చిందగ్గరినుండి జరిగిన అన్ని ఉద్యమాల్లో, రాజకీయ కార్యక్రమాల్లో నిబద్ధదతో పాల్గొని, అదేవిధంగా జెండాలు మోసింది అత్యధికంగా బిసీలే? పోరాట ఫలితాలు మాత్రం బిసీలకు దక్కలేదు. పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లు విద్యలో, ఉపాదిలో, ఇతర రంగాల్లో సాధించుకున్నవాటిని లిటిగేషన్లద్వారా, క్రీమిలేయర్‌వంటి విధానాలద్వారా ఏదో ఒక రూపంలో ఆపేసే ప్రయత్నాలు చేయడం నిరంతరంగా జరుగుతూనే ఉంది? సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమానత్వం అన్న సిద్ధాంతాలను అపహాస్యం చేయడం అన్ని స్థాయిల్లో జరుగుతూనే ఉంది? బిసీలను మభ్యపెట్టడమో, విస్మరించడమో, అణచివేయడమో కొనసాగుతూనే ఉంది? ఇది ఇలా ఇంకెంతకాలం కొనసాగుతుంది? ఇప్పడేం చేయాలి? మనం సీరియస్‌గా పరిశీలించాల్సి ఉంది. పై అంశాలన్ని వాస్తవ గణాంకాలద్వారా విశ్లేషించి బిసీలకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా అవగాహన పెంచుకోడానికి ఆలోచనల్ని పంచుకోవడానికి, ఇంతవరకు జరిగిందాన్ని సమీక్షించి, ఎక్కడ ఎలాంటిలోపం జరిగింది? దీనికెవరు బాద్యులు? మొదలగు విషయాలు విశ్లేషించడం అవసరం. అదే విధంగా ఈ పరిస్థితులనదిగమించడానికి ఇప్పడేంచేయాలి? అభివృద్ధికి సంబంధించిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక విధానాలు, వ్యూహాలు, ప్రణాళికలు, కేటాయింపులు ఎలా ఉండాలి? ముఖ్యంగా రాష్ట్రంలో, కేంద్రంలో బిసీల గురించి ప్రత్యేకంగా ఫోకస్‌చేసే శాఖల కార్యక్రమాలు వాటి కేటాయింపులు కనీసం అయిదారు శాతం బిసీ జనాభాకు కూడా వర్తించడంలేదు. అందుకొరకు ఇప్పుడు ప్రత్యేకంగా కేంద్రంలో, రాష్ట్రంలో 'బిసీ స్పెషల్ ప్లాన్' ద్వారా జనాభాదామాషా ప్రకారం బడ్జెట్ కెటాయింపులు, బిసీ వృత్తుల ఆధునీకీకరణ, వివిధీకరణ, ఎంబిసీలకు 'నిరంతర ప్రణాళిక' ఫెడరేషన్ల పునరుద్ధరణ మొదలగు అనేక అంశాలపై విస్తృత చర్చ జరిపి నూతన అభివృద్ధి వ్యూహాలను రూపొందించాల్సి వుంది. అన్ని అంశాల్లో నిర్మాణాత్మకమైన సూచనలు చేయడం కూడా అవసరం. ఈ పరిస్థితిమారి బిసీలకు అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో సమాన అభివృద్ధి, సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం, సమాన వనరుల పునఃపంపిణి సమన్యాయం, సమాన హక్కులు, సమాన స్వేచ్ఛ, సమాన నిర్ణయాధికారం, సమాన బాగస్వామ్యం లభించి, రాజ్యాంగంలో పేర్కొన్నట్లు సమానత్వంతో, గౌరవప్రదమైన భారత పౌరులుగా జీవించే క్రమాన్ని నిర్దేశించి వారిని పునః సమీకరించబడడానికి ఉన్న అవకాశాలను ఆన్వేషించడానికి బిసీ మేధావుల, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమిష్టి రౌండ్‌టేబుల్ సమావేశం తేది : 28-08-2011 ఆదివారం ఉదయం పదిగంటలకు హైదరాబాద్, పబ్లిక్ గార్డెన్‌లోని జూబ్లిహాలులో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాలుపంచుకొవడానికి బిసీ బందుజన మిత్రులందర్ని ఆహ్వానిస్తున్నాం. అందరికి ఇదే ఆహ్వానంగా భావించి బిసీ సంఘాల ప్రతినిధులు, బిసీ చైతన్య కార్యకర్తలు ఇందులో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాం.

***నిర్వాహకులు :*** **మహాత్మ జోతీరావుపూలే అకాడమి ఆఫ్ బ్యాక్‌వర్డ్ కాస్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ (ABCDE) బిసీ మేధావుల ఫోరం; రాయ్స్ అండ్ రాయ్స్; బిసీ టైమ్స్; బిసీ విద్యార్థి వేదిక; బిసీ కులాల సమాఖ్య; బిసీ కులాల ఐఖ్య వేదిక; బిసీ మహాజన వేదిక; బిసి మిత్రులు; తెలంగాణ బిసీ ఫోరం; కాకతీయ యూనివర్సిటీ బిసీ టీచర్స్ అసోసియేషన్, కెయు బిసీ నాన్ టీచింగ్ అసోసియేషన్, ఇతర బిసీ ఉద్యోగ, కుల సంఘాల సౌజన్యంతో...**

సమావేశాన్ని ప్రతిపాదించి ఆహ్వానించువారు : **ప్రొ॥ కె. మురళీమనోహర్, 9849550403; ప్రొ॥ కంచె అయిలయ్య, 9704444692; ప్రొ॥ పి.యల్. విశ్వేశ్వరరావు, ప్రొ॥ యస్. సింహాద్రి, ప్రొ॥ ఐ. తిరుమలి, డా॥ బి. నర్సయ్య, డా॥ వినయ్ కుమార్, డా॥ మధుచందర్, సంగం సూర్యారావు, ప్రొ॥ కె. బొబ్బిలి, పొ॥ జి. సుధాకర్, ప్రొ॥ పి. నరేంద్రబాబు, ప్రొ॥ టి. రమేశ్, ప్రొ॥ డి. రవీందర్, కె. పద్మాచారి.**